ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
బుధవారం 31 జూలై 2024



ఊరూరా రుణమాఫీ సంబరాలు
సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకాలు 6

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి
పుష్పాభిషేకం 6

పెరిగిన పసుపు సాగు




- సీజన్‌లో క్వింటాలుకు రూ. 20 వేలకు పైగా పలికిన ధర
- సాగు రెట్టింపు అవుతుందని అంచనా వేసిన అధికారులు
- జిల్లాలో ఇప్పటికే సుమారు 10 వేల ఎకరాలు పసుపు

జగిత్యాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే పసుపు పంట సాగులో ప్రత్యేకత చాటుకున్న జగిత్యాల జిల్లాలో ప్రస్తుత యేడాది సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఈ ఏడాది పసుపు సాగు విస్తీర్ణం కాస్త ఆశాజనకంగా ఉంది. 2024-25 సీజన్‌కు సంబంధించి పంట వేయడం పనులను అన్నదాతలు చురుకుగా చేస్తున్నారు. కోరుట్ల, ధర్మపురి, జగిత్యాల, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గాల్లో గల పలు మండలాల్లో పసుపు సాగు చేస్తుంటారు. అయితే గత సీజన్‌లో పండించిన పంటకు రికార్డు స్థాయిలో ధరలు రావడంతో ఈ ఏడాది విస్తీర్ణం భారీగా పెరుగుతుందని అందరు అంచనా వేశారు. కానీ పలు పరిస్థితుల కారణంగా పసుపు సాగు పెరుగుతు న్నప్పటికీ పెంపు అంచనాకు తగ్గట్టుగా సాగు కావడం లేదు.

దాదాపుగా జిల్లాలో అయిదు దశాబ్దాలుగా పలు ప్రాంతాల్లో పసుపు సాగవుతుంది. అయిదేళ్ల కిందట వరకు సుమారు నాలుగు నుంచి ఆరు వేల ఎకరాల్లో నగటు విస్తీర్ణంలో పసుపు పంట వేసేవారు. దిగుబడులు తగ్గడం, ధరలు నానాటికి దిగువకు చేరుతుండడంతో రైతుల ఆశలు సన్నగిల్లాయి. ఒక దశలో పెట్టుబడులు కూడా దక్కించుకోలేని స్థితిని ఎదుర్కొన్నారు. ఇక వదిలించుకుందామని భావించి తగిస్తూ వస్తున్నారు. పదెకరాలు పండించే వారు రెండెకరాలు, రెండెకరాలు వేసేవారు అర ఎకరంతో సరి పెట్టుకున్నారు. గత యేడాది సుమారు 8 వేల ఎకరాలలో మాత్రమే వేశారు. అనూహ్యంగా పంటకు క్వింటాకు సగటున రూ. 16 వేల నుంచి గరిష్ఠంగా రూ. 20 వేల వరకు ఎగబాకింది. సమీపంలోని నిజామాబాద్, సాంగ్లీ మార్కెట్‌లలో రూ. 29 వేల వరకు సైతం పలికింది. దీంతో ఈ ఏడాది రైతుల సాగు రెట్టింపు చేస్తారని అంతా భావించారు. ఉద్యానశాఖ అధికారులు కూడా భారీగానే అంచనాలేశారు. కానీ ఇప్పటివరకు కేవలం సుమారు 10 ఎకరాలకే సాగు పరిమిత మైంది. రానున్న రోజుల్లో మరో సుమారు 5 వేల ఎకరాల వరకు సాగు అవుతుందన్న అంచనా ఉంది. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత సీజన్‌లో సుమారు 15 వేల ఎకరాలు పసుపు సాగు కానుంది. మొక్క జొన్న పంటలో అంతరపంటగా సైతం పసుపు సాగు చేస్తున్నారు. దీంతో గతేడాది కంటే పసుపు సాగు పెరిగనట్లయింది.

రైతులకు ఎదురవుతున్న విత్తన కొరత...

జగిత్యాల జిల్లాలో పసుపు ఆశించిన స్థాయిలో సాగు పెరగకపోవడానికి ప్రధాన కారణంగా విత్తన కొరత అని రైతులు అంటున్నారు. ముఖ్యంగా అవసరమైనంత విత్తనం అందుబాటులో ఉండక పోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. కోత దశలోనే పచ్చి పసుపును విత్తనం కోసం నిల్వ చేసే రైతులు ధర పెరిగే సమయానికి తమ వద్ద ఉన్న పసుపు అంతా ఉడి కించడంతో విత్తన కొరత ఏర్పడింది. ఇది సాగు విస్తీర్ణం పెరగకపోవడానికి ప్రధాన కారణంగా మరిందని అన్నదాతలు అభిప్రాయపడుతున్నారు. సమీపంలోని నిజామాబాద్ జిల్లా కమ్మరిపల్లి, నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం బాదనకుర్తి తదితర ప్రాంతాల రైతుల వద్ద విత్తన పసుపును సేకరించి సాగు పెంచుకునే ప్రయత్నాలు రైతులు చేస్తున్నారు. ఇదిలా ఉండగా పసుపు రైతులకు విత్తన ఎంపిక, ప్రాసెసింగ్, సాగు, చీడపీడల నివారణ తదితర వాటిల్లో సలహాలు, సూచనలు ఇవ్వాలని పసుపు బోర్డు అధికారులు పత్తా లేకపోవడం సైతం రైతులను నిరుత్సాహానికి గురిచేస్తోంది.




పసుపులో అంతర పంటలు..

జిల్లాలో పసుపులో అంతర పంటలను రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. పసుపులో మొక్కజొన్న, ఆముదం పంటలను అంతర పంటలు వేసుకుంటూ రైతులు అదనపు ఆదాయం పొందడానికి ప్రయత్నిస్తున్నారు. పసుపులో మొక్కజొన్నను 2:1 నిష్పత్తిలో, ఆముదాన్ని 10:1 నిష్పత్తిలో వేసుకుంటున్నారు. పసుపులో కందిని వేయాలనుకే రైతులు 9:1 నిష్పత్తిని పాటిస్తున్నారు. కొందరు మామిడి తోటల్లో పసుపును అంతర పంటగా వేసుకుంటున్నారు. పసుపు రైతులు అధిక కుర్కుమిన్ కలిగిన రకాలను వేసుకుంటున్నారు.

మళ్లీ మంచి రోజులొస్తాయి

ప్రతాప్ సింగ్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి



జిల్లాలో పసుపు సాగుకు మళ్లీ మంచి రోజులొస్తున్నాయి. నాణ్యమైన వంగడాలతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పంటలేస్తున్నా రు. పెట్టుబడిని తగ్గించేందుకు అవసరమైన కార్య చరణ సిద్ధం చేశాం. అంతర్జాతీయంగా కొనుగోళ్ల కు డిమాండ్ ఉండడం కలిసొస్తుంది. రానున్న రోజుల్లో సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది.

మొక్కజొన్నలో అంతరపంటగా పసుపు

వాణి, జిల్లా వ్యవసాయ అధికారిణి



జిల్లాలో మొక్కజొన్నలో అంతరపంటగా పసుపు సాగు చేస్తున్నారు. గత చివరి సీజన్‌లో పసుపునకు మార్కెట్‌లో గణనీయంగా ధరలు రావడం వల్ల రైతులు ఎక్కువగా పసుపు సాగుకు ముందుకు వస్తున్నారు. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నాము. ఎప్పటికప్పు డు సాగు వివరాలను సేకరిస్తూ ప్రభుత్వానికి నివేదిస్తున్నాము. జిల్లాలో స్పైస్ బోర్డు అధికారుల పర్యటనలు లేవన్న ఫిర్యాదులు వస్తున్నాయి. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకవెళ్తాము.

రెండు ఎకరాల్లో వేశా...

కూసరి మల్లారెడ్డి, పసుపు రైతు, వెల్దుర్తి గ్రామం



గతంలో యేటా సుమారు మూడు, నాలుగు ఎకరాలకు తగ్గకుండా పసుపు సాగు చేసేవాడిని.. ధరలు లేవని గతేడాది ఎకరం వరకే పరిమితం చేశాను. గత సీజన్‌లో గిట్టుబాటు ధర వచ్చిందనే కారణంతో ఈ ఏడాది రెండు ఎకరాలకు పెంచాను. మార్కెట్‌లో డిమాండ్ ఉంటేనే ఏ పంటైనా పండించేందుకు రైతులు కష్ట పడుతారు... ఇష్టపడుతారు. నాణ్యమైన దిగుబడులు పెరిగేలా శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు ఇవ్వాలి.

పసిడితో పసుపు పంటకు పోలిక...

జిల్లాలో రైతులు పసుపు పంటను పసిడి (బంగారం)తో పోల్చుతుంటారు. పసుపు దిగుబడితో పాటు ధర ఎక్కువగా ఉన్న సందర్భాల్లో జిల్లాలోని రైతులు శుభకార్యాలను ఆర్భాటంగా చేస్తుంటారు. ప్రస్తుతం పసుపు ధర ఆశించిన దాని కంటే ఎక్కువగా ఉండడం రైతన్నల్లో ఆనందం నింపింది. పసుపు పంటను ఒక పర్యాయం సాగు చేసిన రైతులు ధర ఎలా ఉన్నా... వరసగా కనీసం ఎనిమిదేళ్ల సాగు చేయడం ఆనవాయితీగా పాటిస్తున్నారు. ఒక యేడాది కాకుంటే మరో యేడాది ధర వస్తుందని, తమ కష్టాలు గట్టెక్కుతాయని రైతులు విశ్వసిస్తుంటారు.

గడువులోగా సీఎంఆర్‌ను అప్పగించకుంటే చర్యలు

అదనపు కలెక్టర్ రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

జగిత్యాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నిర్ణీత గడువులోగా సీఎంఆర్‌ను ప్రభుత్వానికి రైస్ మిల్లర్లు అప్పగించకుంటే చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ఆడిటోరియంలో 2023-24 సంవత్సరానికి సంబంధించిన సీఎంఆర్ చెల్లింపులపై రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువు తేదీలోగా సీఎంఆర్ బకాయిలు చెల్లించాలని, లేని యెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఎంఆర్‌కు సంబంధించిన సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్లు, క్షేత్ర స్థాయి సిబ్బంది రోజువారీ లక్ష్యం ప్రకారం వారివారి పరిధిలోని రైస్ మిల్లుల నుంచి సీఎంఆర్‌ను డెలివరీ చేయించాలని, ఎప్పటికప్పుడు నివేదికలను అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయి అధికారి వెంకటేశ్వర్‌రావు, సివిల్ సప్లయి కార్పోరేషన్ డీఎం హతీరాం, పలువురు పారా బాయిల్డ్ రైస్ మిల్లర్లు, రా రైస్ మిల్లర్లు, సివిల్‌సప్లయి అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అంజన్న భూముల డిజిటల్ సర్వే



సర్వే చేస్తున్న దేవస్థానం అధికారులు

మల్యాల, జూలై 30: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంకు గల భూములను అధికారులు డిజిటల్ సర్వే చేస్తున్నారు. దేవస్థానానికి గల 650 ఎకరాల భూములు అన్యాక్రంతం కాకుండా హద్దులు ఏర్పాటు చేయాలనే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం సర్వే పనులను ప్రారంభించారు. డీజీపీఎస్ ద్వారా కొండపైన దిగువన తదితర చోట్ల గల భూములను సర్వే చేస్తామని సర్వే పూర్తి అయ్యాక హద్దులు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇటీవల ఘాట్‌రోడ్డు మార్గం, దిగువ కొండగట్టులో దేవస్థానం భూములను ఆక్రమించుకుంటున్నారనే ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్ భూముల సర్వేకు ఆదేశించారు. ఈ సర్వే వారం రోజుల పాటు కొనసాగనుంది. సర్వే కార్యక్రమంలో ఈవో చంద్రశేఖర్, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, ఉమామహేశ్వర్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు

నల్ల బ్యాడ్జీలతో జర్నలిస్టుల నిరసన



నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తున్న జర్నలిస్టులు

జగిత్యాల టౌన్, జూలై 30 : జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరు విషయంలో ప్రభుత్వంతో పాటు నాయకులు పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ జగిత్యాలలో మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్ చౌరస్తాలో ఉన్న బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి జర్నలిస్టు సంఘం నాయకులు వినతి పత్రం అందజేసి తమ నిరసనను తెలియజేశారు. ఇళ్ల స్థలాలు సాధించే వరకు ఈ పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల పట్టణ జర్నలిస్టు సంఘం నాయకులు శ్రీనివాసరావు, ప్రదీప్ కుమార్, మహేష్ కుమార్, శ్రీనివాస్, గోపాల చారి, రాజేందర్ రెడ్డి, శశిధర్, సందీప్ రావు, రాజేష్, అంజయ్య, స్వామి, లక్ష్మారెడ్డి, సంపూర్ణ చారి, కమలాకర్ రెడ్డి, హన్మంతు ఉన్నారు.

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

జగిత్యాల అర్బన్, జూలై 30: రాష్ట్రం ప్రభుత్వం ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బీజేపీ విభాగం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ ఓబీసీ విభాగం రాష్ట్ర శాఖ పిలుపుమేరకు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపిన అనంతరం కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ విభాగం బాధ్యులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రుణ మాఫీ అమలుకు సమన్వయంతో పనిచేయాలి

అధికారులతో కలెక్టర్ సత్య ప్రసాద్



రైతులకు రుణ మాఫీ చెక్కులను అందిస్తున్న కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రెండవ విడతలో రైతు రుణ మాఫీ జరిగిన లబ్ధిదారుల బ్యాంకు రుణాలను రెన్యువల్ చేసుకొని మాఫీ సొమ్మును సేవింగ్ ఖాతాల్లో జమ చేయాలని, ఇందుకు బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సత్య ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిఅసెంబ్లీ నుంచి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు రుణ మాఫీ రెండో విడత నిధుల విడుదల కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్క్రీన్‌ల ద్వారా సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని పలువురు రైతులు, అధికారులతో కలిసి కలెక్టర్ తిలకించారు. అనంతరం పలువురు రైతు లకు రుణ మాఫీ చెక్కును అందించారు. ఈ సందర్భంగా అధికారులు, రైతులనుద్దేశించి కలెక్టర్ మాట్లా డారు. జిల్లాలో మొదటి విడత కింద రూ. లక్ష లోపు రుణం ఉన్న రైతులకు, రెండ విడత కింద రూ. లక్షన్నర లోపు రుణం ఉన్న రైతులకు మాఫీ నిధులు విడుదల చేశామన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిణి వాణి, జిల్లా సహకార అధికారి రఘువరన్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంకుమార్, వివిధ శాఖల బ్యాంకు మేనేజర్లు, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నవ్య ఫ్రెషర్స్ డే హంగామా



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

జగిత్యాల అర్బన్, జూలై 30: పట్టణంలోని స్థానిక నవ్య బాలికల జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు పట్టణ బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి హా జరై, జ్యోతి ప్రజ్వలన చేసి, వేడులకను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు విద్యతో పాటు అన్ని రంగాల్లో పురుషులతో పోటీపడి రాణించాలన్నారు. అంతకుముందు వివిధ పోటీ పరీక్షలు, కళాశాల నుంచి అత్యుత్తమ ర్యాంకులు సాధించి ప్రతిభ కనబర్చిన విద్యార్థి నులకు చైర్‌పర్సన్ జ్యోతి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఈ వేడుకల సందర్భంగా విద్యార్థినులచే ప్రదర్శించబడిన పలు నృత్య, సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శ్రీపాద నరేష్, ప్రిన్సిపాల్ గాలిపెల్లి ఈశ్వర్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల ముందస్తు అరెస్టు

పెగడపల్లి, జులై 30 : తమ సమస్యల పరిష్కారానికి గాను గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన చలో హైదరాబాద్‌కు తరలకుండా పెగడపల్లి మండలంలో పోలీసులు మంగళవారం తెల్లవారుజాముననే పంచాయతీ కార్మికులను ముందస్తుగా అరెస్టు చేశారు. అనంతరం విడిచిపెట్టారు.

కొడిమ్యాల: సమస్యల పరిష్కారానికి హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాకు మంగళవారం వెల్లుతున్న పంచాయతీ కార్మికులను కొడిమ్యాల ఎస్సై ఎస్ సందీప్ ఆధ్వర్యంలో పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో జిల్లా పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షుడు కోమటి చంద్రశేఖర్, మండల నాయకులు గుడిసె దేవయ్య, సత్తయ్య, రమేష్, మునీందర్, మొహన్, అశోక్, మల్లయ్య ఉన్నారు.

బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచ్‌ల నిరసన

- ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయింపు



ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలపుతున్న మాజీ సర్పంచ్‌లు

వెల్గటూర్, జూలై 30: గ్రామాలలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి వెల్గటూర్ మండల తాజా మాజీ సర్పంచ్‌లు మంగళవారం వెల్గటూర్ మండల పరిషత్ కార్యాలయం ముందు బైఠాయించారు. అనంతరం ఎంపీడీవో రవీంధర్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామాలలో రైతు వేదికలు, పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు, నూతన గ్రామ పంచాయతీ భవనాలు, సంఘ భవనాలు, మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా అదనపు తరగతి గదులు, కిచెన్ షెడ్‌లు, డైనింగ్ హాల్‌లు నిర్మాణం చేపట్టినప్పటికీ పదవీ కాలం పూర్తి అయి ఆరు నెలల కాలం పూర్తి అయినప్పటికీ ఇప్పటి వరకు బిల్లులు చెల్లించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాలలో చేపట్టిన సీసీ రోడ్లు, మురుగు నీటి కాలువల నిర్మాణం, హైమాస్ లైట్లు వంటి అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని మండిపడ్డారు. సర్పంచ్‌లకు రావాల్సిన గౌరవ వేతనం కూడా సంవత్సర కాలంగా పెండింగ్‌లో ఉంచారని, పీఆర్ ఈఈ, డీఈఈలు కూడా బదిలీపై వెళ్లారని వాపోయారు. ఇప్పటికైనా పెండింగ్ బిల్లులు త్వరగా చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్‌లు కొమ్ము రాంబాబు, గంగుల నగేష్, బోడకుంటి రమేష్, రూపారాణి రంచంద్రం, రవి, సాగర్, మెతుకు స్వరూప స్వామి, లావణ్య సనీల్, లక్ష్మి ఎల్లయ్య, మౌనిక రవితేజ పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో చోరీ

సుల్తానాబాద్, జూలై 30: సుల్తానాబాద్ పట్టణంలోని మద్యం దుకాణాల్లో మంగళవారం దొంగతనాలు జరిగాయి. ఉదయం మద్యం షాపులను తెరువడంతో దొంగలు పడ్డట్టు గుర్తించారు. వెంటనే షాపుల యజమానులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రినగర్‌లోని ఓ వైన్ షాపులో గాలికోసం ఉన్న చిన్న కిటికీని ఊడదీసి లోపలకు దొంగలు దూరారని పెద్దగా మద్యం చోరీ కాలేదని, నగదు డబ్బుల కోసం కౌంటర్లు చెక్ చేశారని కానీ వారికి ఏమీ నగదు దొరకలేదని యజమాని సంతోష్‌రావు తెలిపారు. అలాగే అక్కడే సమీపంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో సైతం దొంగలు పైకప్పు రేకులు తీసి లోనికి వచ్చారని కౌంటర్‌లో ఉన్న చిల్లర దాదాపు రెండు వేల వరకు తీసుకు వెళ్లారని నిర్వాహకులు నరేష్ తెలిపారు.

సుభాష్‌నగర్‌లో బైక్ చోరీ

సుల్తానాబాద్ పట్టణంలోని సుభాష్‌నగర్‌లో ఎవరూ లేని ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో దూరిన దొంగ ఇరవై వేల నగదు చోరీ చేశాడని దాంతో పాటు ఇంటి ఆవరణలో ఉంచిన ద్విచక్ర వాహనాన్ని సైతం ఎత్తుకెళ్లాడని బాధితుడు ఆరేపల్లి బాలరాజు తెలిపారు. తాము ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గమనించి ఈ దొంగతనానికి పాల్పడ్డాడని తెలిపారు. ఈ చోరీ మొత్తం సీసీ కెమెరాలో రికార్డు అయి ఉంది.

జ్వరంతో బాలుడి మృతి

సుల్తానాబాద్, జూలై 30: మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఓ బాలుడు మంగళవారం మృతిచెందాడు. సుల్తానాబాద్ పట్టణంలోని గడీమహల్‌కు చెందిన సాదిక్-రెహనా దంపతుల పదకొండు నెలల కుమారుడు మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. రెండు రోజులు పట్టణంలోని ఓ ఆర్ఎంపీ వైద్యుడి వద్ద చికిత్స చేయించారు. జ్వరం తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరిగి ఫిట్స్ వచ్చాయి. సోమవారం రాత్రి కుటుంబ సభ్యులు సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుడి సూచన మేరకు బాలుడిని కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలుశిక్ష

కోల్‌సిటీ, జూలై 30: మద్యం సేవించి వాహనం నడిపి రెండవసారి పోలీసులకు పట్టుబడిన కేసులో బామిని భరత్ అనే వ్యక్తికి మంగళవారం గోదావరిఖని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు రెండవ అదనపు న్యాయమూర్తి వెంకటేష్ దుర్వ మూడు రోజుల జైలు శిక్ష విధించారు. మరో 11మందికి రూ.2000చొప్పున జరిమానా విధించినట్టు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

గంగాధర, జూలై 30: గంగాధర మండలం మధురానగర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని డీటీసీఎస్, ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు పట్టుకున్నారు. గంగాధర డీటీసీఎస్ ఉష మాట్లాడుతూ మధురానగర్ గ్రామ పరిధిలోని పత్తికుంటపల్లిలోని మామిడితోటలోని ఓ ఇంట్లో అక్రమంగా 40 క్వింటాళ్ల రేసన్ బియ్యం నిల్వ ఉంచినట్లు పక్కా సమాచారం అందింది. మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంటు అధికా రులు, డీటీసీఎస్ బృందం తనిఖీ చేయగా సంచుల్లో నింపిన 40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడినట్లు తెలిపారు. ఇంటిపక్కన ఉన్న కడమంచి రమేష్ మోటర్ సైకిళ్లమీద ఊళ్లలో సేకరించిన రేషన్ బియ్యా న్ని జగిత్యాలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు



గాయత్రి పంప్ హౌస్ నుంచి విడుదలవుతున్న నీరు



ఉధృతంగా ప్రవహిస్తున్న గ్రావిటీ కెనాల్

పెద్దపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరుకు ఎత్తిపోతల ద్వారా నీటి తరలింపు కొనసాగుతున్నది. మంగళవారం ప్రాజెక్టులోకి వస్తున్న వరద నీరు తగ్గుముఖం పట్టినా కూడా ఎత్తిపోతలను అధికారులు కొనసాగిస్తున్నారు. సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి 11,173 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా, ఇందులో కడెం ప్రాజెక్టు నుంచి 3,568 క్యూసెక్కులు, ఎగువ ప్రాంతం నుంచి 7,605 క్యూసెక్కుల నీళ్లు వస్తున్నాయి. మిడ్ మానేరుకు 5 మోటార్ల ద్వారా 15,750 క్యూసెక్కుల నీటిని పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారంలోని నంది పంప్‌హౌస్ ద్వారా గాయత్రి పంప్‌హౌస్‌కు, అక్కడి నుంచి వరద కాలువ ద్వారా మిడ్ మానేరులోకి ఎత్తిపోస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 17.371 టీఎంసీలు ఉన్నాయి.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న పంపింగ్

రామడుగు: మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నాలుగో రోజు కూడా నీటి విడుదల కొనసాగుతుంది. శనివారం 4 బాహుబలి పంపు నుంచి నీటి విడుదల చేసిన అధికారులు మంగళవారం కూడా నీటి విడుదల యథావిధిగా కొనసాగించారు. ఐదు పంపుల ద్వారా 15,750 క్యూసెక్కుల నీరు వరద కాలువ ద్వారా ఎస్ఆర్ఆర్ మిడ్ మానేరు డ్యాంలోకి తరలి వెళ్తుంది. డెలివరీ పాయింట్ నుంచి గ్రావిటీ కెనాల్‌లోని ఐదు పంపులు ఒకేసారి విడుదల కావడంతో నీటి ప్రవాహం పెరిగింది. గ్రావిటీ కెనాల్ నుంచి నీటి ప్రవాహం పరవళ్లు తొక్కుతూ వరద కాలువ ద్వారా మిడ్ మానేరుకు తరలిపోతుంది. ఐదు పంపులతో నీటి విడుదల కొనసాగిస్తుండగా అటు గ్రావిటీ కెనాల్ ఇటు వరద కాలువలో నీటి ప్రవాహం కనువిందు చేస్తోంది.

మిడ్ మానేరులో 9టీఎంసీల నీరు

బోయినపల్లి: మండలంలోని మిడ్ మానేరు ప్రాజెక్టుకు గాయత్రి పంప్‌హౌస్ ద్వారా 15,750 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 318 మీటర్లకు 308.46 మీటర్లు, పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 27.50 టీఎంసీలకు 9.19 టీఎంసీలు ఉన్నది.

ఎస్సారెస్పీలోకి 22,285 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. మంగళవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 22,285 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 35.297 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 76.894 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 664 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 30.058 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

రుణమాఫీ కార్యక్రమంలో అల్గునూర్ రైతు



హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎంతో రైతు జాప లక్ష్మారెడ్డి

తిమ్మాపూర్, జూలై30: రైతు రుణామాఫీలో కార్యక్రమంలో భాగంగా 1లక్ష 50వేల వరకు రైతులకు రెండవ విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని మంగళవారం హైదారాబాద్‌లోని అసెంబ్లీ ఆవరణలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఇతర జిల్లాల నుంచి వచ్చిన రైతులతో పాటు జాప లక్ష్మారెడ్డి పాల్గొని రైతు కుంటుంబాలకు సీఎం రేవంత్ రెడ్డి అందజేసిన చెక్కును అందుకున్నాడు. తనకు 1లక్ష 22వేల 979రూపాయల రుణమాఫీ అయిందని తెలిపాడు. సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్న కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

అక్రమంగా ఇంటి మార్పిడి చేసిన వారిపై కేసు

గంగాధర, జూలై30: గంగాధర మండలం కొండన్నపల్లిలో అక్రమంగా ఇంటి మార్పిడి చేసిన వ్యక్తితో పాటు అప్పటి కార్యదర్శిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొండన్నపల్లికి చెందిన కడార్ల ఆగయ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆగయ్య గతకొన్ని సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆగయ్యకు వెంకటాచారి, సత్యనారాణ ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆగయ్యకు గ్రామంలో వారసత్వంగా ఉన్న ఇంటిని ఇద్దరి అన్నదమ్ములకు చెందవలసి ఉండగా సత్యనారాయణ పేరుపై 2018లో అప్పటి కార్యదర్శి మార్పిడి చేశాడు. వెంకటచారి ఫిర్యాదు మేరకు సత్యనారాయణ, అప్పట్లో గ్రామంలో పనిచేసిన కార్యదర్శిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రభుత్వ వైద్యుడిపై దాడి



గాయపడిన వైద్యుడు

కాల్వశ్రీరాంపూర్, జూలై 30: కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ మహేందర్ విధులు ముగించుకొని పెద్దపల్లికి వెళ్తుండగా మార్గమధ్యలో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ దాడిలో డాక్టర్ మహేందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వైద్య చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కాల్వ శ్రీరాంపూర్ ప్రభుత్వాసుపత్రిలో విధులు నిర్వహించి సాయంత్రం తన కారులో పెద్దపెల్లికి వెళుతుండగా మార్గమధ్యలో గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేసి పారిపోయినట్లు సమాచారం.

కుక్కను తప్పించబోయి యువకుడికి తీవ్ర గాయాలు

జమ్మికుంట రూరల్, జూలై 30: జమ్మికుంట మండలం గోవిందాపూర్ గ్రామంలో ఓ యువకుడు కుక్కను తప్పించబోయి ద్విచక్రవాహనం మీద నుంచి కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. వీణవంక మండలం లస్మక్కపేట గ్రామానికి చెందిన దాసారపు సతీష్ గోవిందాపూర్ గ్రామంలో ఎదురుగా వస్తున్న కుక్కను తప్పించబోయి ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం మీద నుంచి కింద పడ్డాడు. తలకు, కాళ్లకు తీవ్రగాయాలు కాగా, చికిత్స నిమిత్తం 108వాహనంలో జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

గ్రామాల్లో కోతుల బెడద

● దాడుల్లో పలువురికి గాయాలు ● కలెక్టర్‌కు వినతి



గాయపడిన వృద్ధురాలు

కరీంనగర్ రూరల్, జూలై30: కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉండటంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ఎలబోతారం గ్రామంలో సమీపంలో గుట్ట ఉండటంతో కోతుల సంచారం పెరిగింది. అయితే మంగళవారం గ్రామంలోకి ప్రవేశించిన కోతులు పలువురిని గాయపరచగా వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామానికి చెందిన ఆడెపు మల్లమ్మ, వాసల శేషమ్మ, తుమ్మణవేని లక్ష్మీ, దుబ్బెట భూమక్కలపై దాడి చేశాయి. కోతి కరవడంతో గాయపడిన వాళ్లు కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. అయితే గత వారం రోజుల కిందట కూడా పత్తెం శ్రీనివాస్ కూతురు అనన్యపై దాడి చేయగా చిన్నారికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. కోతుల బెడద నుంచి కాపాడాలని జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడు మాసం సుధాకర్ మంగళవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కోతుల నుంచి ప్రజలను రక్షించేందుకు చర్యలు చేపట్టాలని, మహిళలు చిన్నారులపై దాడి చేస్తున్న కోతులను పట్టుకునేందుకు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

9నుంచి ఎస్‌యూ పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్, జూలై 30: ఎస్‌యూ పరిధిలోని పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 9నుంచి ప్రారంభం కానున్నట్లు పరీక్షల నియంత్రాణాధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలను మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం www.satavahana.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

● ఎంబీఏ, ఎంసీఏ, పరీక్షలు ఆగస్టు 9 నుంచి 19వ తేదీ వరకు జరగనున్నట్లు పరీక్షల నియంత్రాణాధికారి తెలిపారు. పరీక్ష సమయం మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుందని తెలిపారు.

అటవీభూమిలో సాగును అడ్డుకున్న అధికారులు



గిరిజనులతో మాట్లాడుతున్న అధికారులు

వీర్నపల్లి, జూలై 30: వీర్నపల్లి మండలం భూక్యతండా గ్రామ పరిధిలోని రాశిగుట్ట తండాలో అటవీ భూమిలో గిరిజనులు పత్తి సాగు చేస్తుండగా అధికారులు మంగళవారం అడ్డుకున్నారు. అటవీశాఖ అధికారులు గిరిజనులకు మధ్య తోపులాట జరుగడంతో ఉద్రిక్తతకు దారితీసింది. వివరాలు ఇలా ఉన్నాయి. రాశిగుట్ట తండాలో గత ఐదేళ్లుగా అటవీ భూమిని చదును చేసి పత్తిపంట సాగు చేసుకుంటున్నామని గిరిజనులు తెలిపారు. అదే భూమిలో అటవీశాఖ అధికారులు మొక్కల ప్లాంటేషన్ పనులు చేపట్టడంతో గిరిజనులు మొక్కలను తొలగించారు. ఈ భూములను కొన్ని ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్నామని గిరిజనులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. గిరిజనులు, అధికారులు ఒకరినొకరు తోసేసుకున్నారు. దీంతో కొద్దిసేపు స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు, వీర్నపల్లి అటవీ సెక్షన్ అధికారి రంజిత్‌కుమార్ తన సిబ్బందితో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకున్నారు. ఉద్రిక్తత మధ్య అధికారులు అక్కడి నుంచి వెను దిరిగి వెళ్లిపోయారు. చదును చేసిన అటవీ భూమిలో మొక్కలను ప్లానిటేషన్ చేస్తామన్నారు.

మరమగ్గాల కార్మికులకు పని కల్పించాలి

● గంగాధర ప్రధాన రహదారిపై కార్మికుల ధర్నా



గంగాధర ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న మగ్గాల కార్మికులు


గంగాధర, జూలై30: గర్షకుర్తి మరమగ్గాల కార్మికులకు పనికల్పించి ఆదుకోవాలని గంగాధర మండలం కురిక్యాల ప్రధాన రహదారిపై గర్షకుర్తి, ఉప్పరమల్యాల, తాడిజెర్రి, రంగరావుపల్లి గ్రామాల మగ్గాల కార్మికులు,సంఘ నేతలు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ గత ఎనిమిది నెలలుగా మగ్గాలు నడవక పోషణ భారమవుతుందన్నారు. గర్షకుర్తి మగ్గాలకు బతుకమ్మ చీరల ఉత్పత్తి ఆర్డర్లు, గుడ్డ ఉత్పత్తి ఆర్డర్లను ప్రభుత్వం ఇప్పించాలని డిమాండ్ చేశారు. గతంలో ఉత్పత్తి చేసిన బతుకమ్మ చీరల కోట్ల బకాలు నిలిచి పోయాయని ప్రభుత్వం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. గర్షకుర్తిలో గత ఆరు రోజులుగా ధర్నాలు చేస్తున్న కనీసం ప్రభుత్వం నుండి స్పందన లేదని అన్నారు. మగ్గాల కార్మికులకు తక్షణం పని కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా కురిక్యాల రహదారిపై కార్మికుల ధర్నాతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి, ఎస్ఐ కిరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసనకారులను శాంతింపజేసి ధర్నాను విరమింపజేశారు. కార్మికులకు మద్దతు తెలిపిన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే కార్మికుల డిమాండ్లను నెరవేర్చి చేతినిండా పని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మగ్గాల కార్మికులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


జాతీయ స్థాయిలో రాణించిన విద్యార్థి

రామడుగు, జూలై 30: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన దాసరి దీపక్ అండర్-14 క్రికెట్ టీం తెలంగాణ రాష్ట్రం తరపున జాతీయ స్థాయిలో ఆడి సత్తా చాటాడు. దీంతో పాటు నేపాల్‌లో జరిగిన క్రికెట్ పోటీల్లో ఆల్ రౌండర్‌గా రాణించాడు. ఈ మేరకు ఆటల్లో రాణించిన విద్యార్థిని మాజీ ఎంపీటీసీ ఎడవెల్లి సురేందర్ రెడ్డి, నేచర్ యూత్ క్లబ్ అంబేద్కర్ యువజన సంఘం తరపున శాలువాతో ఘనంగా సత్కారించారు.ఈ కార్యక్రమంలో నేచర్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కాసారపు పరశురాం, బుర్ర శ్రీకాంత్, రేణిగుంట అశోక్ పాల్గొన్నారు.

రూ.7,150 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూలై 30: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,150 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు ఒక రైతు 15క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చాడు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7150 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.





ఆర్టీసీకి 'మహాలక్ష్మి'తో ఊపు

● ఉమ్మడి జిల్లాలో రూ.230.72 కోట్ల ఆదాయం



భగత్‌నగర్, జూలై 30: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహాలక్ష్మి పథకం ద్వారా ఆదాయం 230.72 కోట్ల రూపాయలు సమకూరింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రకటించడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బస్సులన్నీ కిక్కిరిసి పోతున్నాయి. ఆర్టీసీలో ప్రయాణించిన మహిళల కోసం మహాలక్ష్మి పథకం కింద ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు డబ్బులు చెల్లించనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రకటించిన 2023 డిసెంబర్ 9 నుంచి మంగళవారం వరకు మహాలక్ష్మి పథకం కింద 6.35 కోట్ల మంది ప్రయాణించారు. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా కరీంనగర్-1, కరీంనగర్-2, జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, సిరిసిల్ల, వేములవాడ, గోదావరిఖని, మంథని, హుజూరాబాద్ హుస్నాబాద్ డిపోలు ఉండగా వాటిలో రీజియన్ ఆదాయంలో మొత్తంలో మహాలక్ష్మి ఆదాయం 49.22 శాతంగా ఉండడం విశేషం. మహాలక్ష్మి పథకం అమలు కంటే ముందు 68.13 శాతం ఆక్యుపెన్సీ రేషియా ఉండగా, మహాలక్ష్మి పథకం అమలు తర్వాత 85.33 శాతానికి పెరిగింది. మహాలక్ష్మి పథకం అమలు తర్వాత ప్రయాణికుల సంఖ్య 4.15లక్షలకు పెరగడంతో తెలంగాణరాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు రీజియన్ వ్యాప్తంగా భారీ మొత్తంలో ఆదాయం సమకూరింది.

రద్దీకి అనుగుణంగా బస్సులు

-రీజనల్ మేనేజర్ సుచరిత



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రీజియన్ వ్యాప్తంగా ఉన్న 11 డిపోల్లో ఆర్టీసీ బస్సులను రద్దీకి అనుగుణంగా నడిపిస్తున్నాం. మహాలక్ష్మి పథకం అమలు తర్వాత రద్దీని బట్టి అన్ని డిపోల్లో బస్సుల సంఖ్య పెంచాం.ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా సంస్థ ఉద్యోగులంతా కలిసికట్టుగా పనిచేస్తున్నాం. ఆర్టీసీని మరింత బలోపేతం చేస్తాం.

ఆలయాల్లో చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

● నిందితుడిపై 17 కేసులు ● సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట, జూలై 30: పలు ఆలయాల్లో చోరీకి పాల్పడిన కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామానికి చెందిన బుద్ధుల యుగేందర్‌ను అరెస్ట్ చేసినట్లు సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన వివరాలను వెల్లడించారు. నిందితుడి వద్ద నుంచి రూ. వేయి నగదు, దొంగతనాలను వినియోగించిన ఇనుప రాడ్‌ను స్వాధీన పర్చుకున్నామని పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో యుగేందర్‌పై 17 కేసులున్నాయని వివరించారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడించిన వివరాల మేరకు.. కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామానికి చెందిన బుద్ధుల యుగేందర్ కూలీ పనులు చేయడంతో పాటు వ్యాన్‌లో క్లీనర్‌గా కొనసాగేవాడు. మద్యం, జల్సాలకు అలవాటు పడిన అతడు సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో చోరీలకు దిగాడు. 2010 నుంచి 2018 వరకు కరీంనగర్ పట్టణంలో పలు దొంగతనాలను పాల్పడి పోలీసులకు చిక్కాడు. అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జైలు జీవితం గడిపి బయటకు వచ్చిన యుగేందర్ ఈ నెల 26న ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల్లోని రాచర్లబొప్పాపూర్, గోరంట్యాల గ్రామంలోని పెద్దమ్మ, ఎల్లమ్మ, సాయిబాబా ఆలయాల్లో చోరీకి పాల్పడ్డాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు ఈ నెల 30న నిందితుడు దొంగతనం చేయడం కోసం కరీంనగర్ నుంచి ఎల్లారెడ్డిపేటకు వస్తున్నాడనే సమాచారంతో స్థానిక బస్టాండ్ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి రూ.వేయి నగదుతో పాటు చోరీకి వినియోగించే ఇనుప రాడ్‌ను స్వాధీనపర్చుకున్నారు. విచారించగా పలు ఆలయాల్లో దొంగతనాలను పాల్పడ్డానని అంగీకరించాడు. కేసును ఛేదించడంలో కీలకపాత్ర పోషించిన సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ రమాకాంత్, క్లూస్ టీం ఏఎస్ఐ శరత్, సిబ్బంది బాబయ్య, రాజేందర్, శ్రీనాథ్‌లను డీఎస్పీ అభినందించారు.

డిప్లొమా కోర్సుల కోసం డైట్‌లో ధ్రువపత్రాల పరిశీలన

తిమ్మాపూర్, జూలై30: ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో రెండు సంవత్సరాల కోర్సులైన డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డిఇఎల్ఇడి), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్(డిఇఎస్ఈ) మొదటి సంవత్సరంలో 2024-25 చేరేందుకు నిర్వహించిన డిఈఈసెట్-2024 ఫలితాలు వెల్లడైనట్లు డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాలు సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఉత్తీర్ణులైన పాత కరీంనగర్ జిల్లాకు సంబంధించిన అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన ఆన్‌లైన్ విధానంలో ఆగస్టు 1,2వ తేదీలు రెండు రోజుల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్), కరీంనగర్ జిల్లా, తిమ్మాపూర్ మండలం, ఎల్ఎండీ కాలనీలో జరగనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ డీఈఈసెట్-2024 హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, ఎస్ఎస్‌సి, ఇంటర్ మెమోలు, ఇంటర్ వరకు స్టడీ, కుల, ఆదాయ(2024) ధ్రువపత్రాలతో పాటు ఇతర ప్రత్యేక పత్రాలు(పిహెచ్‌సి, ఎన్‌సిసి, సిఏసి ఉంటే) ఒరిజినల్స్ వెంట తీసుకుని రావాలని పేర్కొన్నారు.

వంతెన మంజూరు చేయాలని సీఎంకు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వినతి

రాయికల్, జూలై 30: మండలంలోని ఆదివాసీ గ్రామమైన జగన్నాథ్‌పూర్ నుంచి రాయికల్, బోర్నపెల్లి మధ్య ఉన్న పెద్దవాగుపై వంతెన మంజూరు చేయాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి పట్టభద్రుల ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి మంగళవారం వినతి పత్రం పంపారు. 100 శాతం ఆదివాసీ గ్రామమైన బోర్నపెల్లి గ్రామానికి మధ్య గోదావరి నదిలో కలిసే పెద్దవాగు ఉండటంతో ప్రస్తుతం వంతెన సౌకర్యం లేదన్నారు. జగన్నాథ్‌పూర్ గ్రామస్థులు బోర్నపెల్లి గ్రామాన్ని చేరుకోవటానికి కనీసం 30 కి.మీ. పైగా అధికంగా ప్రయాణం చేసే పరిస్థితి ఎదురవుతోందన్నారు. ఈ నదిపై ఏ విధమైన వంతెన సౌకర్యం లేక పోవడంతో జగన్నాథ్‌పూర్ గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజనులు సంవత్సరాల తరబడి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో అనేక పర్యాయాలు అంచనాలు రూపొందించినప్పటికీ మంజూరుకు నోచుకోలేదని, ప్రస్తుతం ప్రతిపాదిత అంచనాలు పరిశీలించగా రూ.12.20 కోట్లు రావడం జరిగిందని, కావున వంతెన నిర్మాణం కోసం రూ.12.20 కోట్లు మంజూరు చేయాలని వారు కోరారు.

అధికారులను గౌరవించడం ప్రతీ ఒక్కరి బాధ్యత



అధికారులను సన్మానిస్తున్న గ్రామస్థులు

రాయికల్, జూలై 30: గ్రామ ప్రజలు, విద్యార్థుల కోసం నిరంతరం కృషి చేస్తున్న అధికారులను గౌరవించడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని ఇటిక్యాల గ్రామస్థులు అన్నారు. గ్రామంలో చేసి విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శి, ఉపాధ్యాయులను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఇటిక్యాల పంచాయతీ కార్యదర్శి, బ్యాంక్ మేనేజర్, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బదిలీ కాగా, పదవీ విరమణ పొందిన అంగన్‌వాడీ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ మహిపతి రెడ్డి, వీడీసీ అధ్యక్షులు విష్ణు, శేఖర్, నాయకులు కొమ్ముల ఆదిరెడ్డి, సామల్ల వేణు, కడార్ల చంద్రశేఖర్, కనపర్తి శ్రీనివాస్, మండలోజు శ్రీనివాస్, కాటిపెల్లి గంగారెడ్డి, శ్రీనివాస్, లయన్స్ క్లబ్ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కండ్లపల్లి పాఠశాలను సందర్శించిన అడిషనల్ కలెక్టర్

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



పాఠశాలను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి

జగిత్యాల రూరల్, జూలై 30: మండలంలోని కండ్లపల్లి మోడల్ స్కూల్‌ను మంగళవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి సందర్శించారు. ఈ నెల 27న 'రహదారి ఇలా బడికి వెళ్లేదెలా' అనే కథనం 'ఆంధ్రజ్యోతి' జిల్లా సంచికలో ప్రచురితమైంది. స్పందించిన అడిషనల్ కలెక్టర్ బురదమయమైన రహదారిని, పాఠశాలలోని శానిటేషన్ పనులను తనిఖీ చేశారు. పాఠశాలలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేకదృష్టి పెట్టాలన్నారు. విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ప్రిన్సిపాల్ నాగ సుధారాణి, ఎంపీడీవో రమాదేవి, హాస్టల్ ఇన్‌చార్జి మధులత, పంచాయతీ కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

చెరువు మత్తడి బుంగ పరిశీలన

పెగడపల్లి, జూలై 30: మండలంలోని నంచర్ల పెద్ద చెరువు మత్తడికి పడిన బుంగను చిన్న నీటిపారుదల శాఖ డీఈ రమేష్, ఏఈ కీర్తిమ మంగళవారం పరిశీలించారు. మూడు సంవత్సరాల క్రితం మత్తడికి గండి పడగా తాత్కాలికంగా అడ్డు గోడ నిర్మించారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులోకి నీరు చేరి గండి పడి నీరు వృథాగా పోతుండగా గ్రామస్థులు స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు మంగళవారం డీఈ రమేష్, ఏఈ కీర్తిమ చెరువు మత్తడి గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించారు. మత్తడి నిర్మాణానికి రూ.34 లక్షలు మంజూరై టెండర్ ప్రక్రియ పూర్తయిందని, తాత్కాలింగా మరమ్మతు చేసి నీరు తగ్గిన తర్వాత మత్తడి నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్, నాయకులు శ్యాంసుందర్ రెడ్డి, సూపర్‌వైజర్ సదానందం ఉన్నారు.

ఆస్పత్రి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే

మెట్‌పల్లి, జూలై 30: మెట్‌పల్లి పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి భవన నిర్మాణం అసంపూర్తిగా ఉన్నందున పనులు పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అసెంబ్లీలో ప్రస్తావించారు. నియోజకవర్గంలోని పలు సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడారు. కోరుట్ల ఆస్పత్రి భవనం ప్రారంభించి చాలా కాలం గడుస్తున్న వైద్యుల కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆశావర్కర్లకు రూ. 3వేల జీతం ఉన్న వారికి కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో రూ. 13వేలకు పెంచారని, కాంగ్రెస్ మెనిఫెస్టోలో తెలిపిన విధంగా వారికి రూ. 18వేల వేతనం చెల్లించాలని కోరారు. కేసీఆర్ ఏర్పాటు చేయించిన బస్తీ దవాఖానాలు, పల్లె దవాఖానాలతో ప్రజలకు ఎంతో మేలు జరిగిందని వాటిని యథావిధిగా కొనసాగించాలన్నారు.

ఆకట్టుకున్న గోరింటాకు వేడుకలు



గోరింటాకు వేడుకలో పాల్గొన్న మహిళా సంఘ సభ్యులు

కోరుట్ల, జూలై 30: ఆశాఢ మాసం పురస్కరించుకుని పట్టణంలోని కాల్వగడ్డ ప్రాంతంలోని బ్రాహ్మణ వీధిలో గోరింటాకు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అధిష్టాన దేవత గౌరీ మాతకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. విష్ణు, లలిత శాస్త్ర పారాయణం జరిపారు. ఈ సందర్భంగా మహిళలు గోరింటాకును అలంకరించుకొని వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలేపు స్వప్న, బ్రహ్మన్నగారి శివరాణి, పద్మజ, లావణ్య, పూర్ణిమ, పద్మజా, జ్యోతి, కరుణ, మహిళ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కిసాన్ సెల్ మండల అధ్యక్షుడిగా తిరుపతిరెడ్డి

ఇబ్రహీంపట్నం, జూలై 30: ఇబ్రహీంపట్నం కిసాన్ సెల్ మండల అధ్యక్షుడిగా క్యాతం తిరుప తిరెడ్డిని నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ఎలాల జలపతిరెడ్డి ఆదేశాలు జారీ చేసినట్లు బ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గూడ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ కిసాన్ సెల్ మండల కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నాట్లు తెలిపారు. మంగళవారం మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ గండి హనుమాన్ ఆలయం వద్ద అధ్యక్షుడిగా క్యాతం తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షులుగా మెడికొండ రమేష్, కార్యవర్గ సభ్యులుగా ప్రశాంత్, రామరాజు, మురళి, నాయణలను ఘనంగా సన్మానించి జువ్వాడి నర్సింగరావు పదవీ బాధ్యతలు అప్పజెప్పినట్లు తెలిపారు.

నూతనంగా ఎన్నికైన సభ్యులు జువ్వాడి నర్సింగరావుకు, ఎలాల జలపతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఊరూరా రుణమాఫీ సంబరాలు



పెగడపల్లిలో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

ధర్మపురి, జూలై 30: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో గల రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన రైతు రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమానికి సంబంధించిన వీడియో కాన్ఫరెన్స్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఏఈవోలు మౌనిక, సమత రైతులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు సంబంధించిన రూ 1.50 లక్షల రుణాలను ఏకకాలంలో ప్రభుత్వం మాఫీ చేసిందన్నారు. వచ్చే నెల ఆగస్టు 15 వరకు రైతులకు పూర్తి స్థాయిలో రుణాలను మాఫీ చేస్తుందని తెలిపారు. అన్నారు.

రాయికల్: రాయికల్ మండలంలోని అల్లీపూర్ గ్రామంలో గల రైతు వేదికలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు పాల్గొని వీక్షించారు. ఈ సందర్భంగా రూ.1.50 లక్షల రుణమాఫీపై ప్రకటన చేశారు. ఈ సందర్భంగా రైతులు హర్షం వ్యక్తం చేశారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలోని అంగడి బజారులో మంగళవారం తెలంగాణ సీఎం రెండో విడుత రుణ మాఫీ నిధులు విడుదల చేసినందుకు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తు సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాజేందర్, గంగన్న, ప్రసాద్, వినోద్‌రెడ్డి, స్వామి, రవి, లచ్చిరెడ్డి, సలాం, శ్రీనివాస్, మల్లేశం, యాదయ్య, నాగార్జున్ పాల్గొన్నారు. మండలంలోని పూడూర్ రైతు వేదిక భవనంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్ రెడ్డి కార్యక్రమాన్ని రైతులు వీక్షించారు. రెండో విడత రుణమాఫీ చేసినందుకు రైతులు హర్షం వ్యక్తం చేశారు. రైతులు, ఏఈవోలు లావణ్య, గ్రీష్మ, మంజుల, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెగడపల్లి: రైతులకు లక్షన్నర లోపు పంట రుణాల మాఫీని హర్షిస్తూ మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ మండల శాఖ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం లక్షన్నరలోపు పంట రుణాలను మాఫీ చేయడంతో ఆ పార్టీ నాయకులు రైతులతో కలసి రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అంబేద్కర్ కూడలిలో బాణాసంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్, ఒరుగల శ్రీనివాస్, ప్రశాంత్, భాస్కర్, కొమురయ్య, వంశీధర్‌రావు, కుమార్, రాజేందర్, అనీల్, ఎల్లయ్య, దుర్గాప్రసాద్, రాజేశం పాల్గొన్నారు.

మల్యాల: రూ.1.50 లక్షల పంట రుణాల మాఫీ కార్యక్రమం సందర్భం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు



కొడిమ్యాలలో క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గా మల్యాల రైతు వేదికలో సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు పాల్గొని ముఖ్యమంత్రి ప్రసంగం వీక్షించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చంద్రదీపక్ ఏఈవోలు మంజుల, కారుణ్య కుమార్, శ్రీనివాస్, ప్రశాంత్ సింగిల్‌విండో చైర్మన్ రాంలింగారెడ్డి, నాయకులు ఆనందరెడ్డి, లక్ష్మారెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, అల్లూరి రాజేశ్వర్ రెడ్డి, మ్యాక లక్ష్మన్, వీరబత్తిని ప్రతాప్, ఒల్లాల మల్లేశంగౌడ్, నరసింహ రెడ్డి, హనుమంతు రైతులు పాల్గొన్నారు

మల్లాపూర్: రెండో విడుతను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించడంతో మల్లాపూర్ రైతు వేదికలో రైతులు, లబ్ధిదారులు సంబరాలు జరుపుకున్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన టీవిలో రెండో విడత సీఎం రేవంద్‌రెడ్డి ప్రారంభ కార్యక్రమంలో లబ్ధిదారులతో ముఖాముఖిగా మాట్లాడే కార్యక్రమాన్ని విక్షించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, అధికారులు మాట్లాడుతూ రెండు లక్షల పైబడి ఉన్న వారు రుణాన్ని మొదట బ్యాంక్‌లో చెల్లించాలి, ఆ తర్వాత అర్హత గల వారికి రెండు లక్షల రుణాన్ని బ్యాంకు ఖాతాలోకి బదిలీ చేయడం జరుగుతుందన్నారు. మండలంలో రెండో విడతగా 1792 మంది రైతులకు రుణమాఫీ అవుతున్నట్లు అధికారులు తెలిపారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పుష్పాభిషేకం

మెట్‌పల్లి, జూలై 30 : పట్టణంలోని బంగారు పెద్దమ్మ ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పుష్పాభిషేకాన్ని నిర్వహకులు ఘనంగా జరిపించారు. మంగళవారం ఆలయంలో బంగారు తల్లి అమ్మవారికి, శ్రీవల్లి దేవి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకాలు, లక్ష్మీదేవి పూజలు తదితర కార్యక్రమాలను ఆలయ పురోహితుడు మదన్‌శర్మ జరిపారు. అనంతరం ఉత్సవ మూర్తులతో భక్తులు పెద్దమ్మ ఆలయం చుట్టూ ప్రదక్షనలు చేసి ఆయలంలో ఏర్పాటు చేయగా ఐశ్వర్య సిద్ధి, సకల కార్యసిద్ధి కోసం ధనలక్ష్మీ అమ్మవారికి పుష్పార్చనలతో అభిషేకాలు, కుంకుమ పూజలు వైభవంగా జరిపించారు. అనంతరం భక్తులు ఆలయం సమీపంలోని శ్రీ ఐశ్వర్యలక్ష్మి గోశాలలోని గోమాలతలకు మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు జరిపి వాటికి ఆహారం అందజేసి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు, పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహళలు

ప్రజాదర్బార్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల టౌన్, జూలై 30 : ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు, ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ప్రజాదర్బార్‌లో పలువురు తమ సమస్యలను వినతుల రూపంలో చైర్ పర్సన్‌కు అందజేశారు. ప్రతి సమస్యను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు చైర్ పర్సన్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సమ్మయ్యతో పాటు వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

జగిత్యాల అర్బన్, జూలై 30: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని పట్టణ ట్రాఫిక్ ఎస్సై ధనుం జయ్ అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం ప్రమాద రహిత వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ధనుంజయ్ మాట్లాడుతూ ప్రజా రవాణా వ్యవస్థలో ఆర్టీసీ సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు ఎల్లవేళలా ప్రయాణీకులతో మర్యాదగా నడుచుకొని సంస్థ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని సూచించారు. తమ సర్వీసులో ఎలాంటి ప్రమాదాలకు కారణం కాకుండా జాగ్రత్తతో డ్యూటీని నిర్వహించిన ప్రమాద రహిత డ్రైవర్లను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సునీత తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

కోలుకున్న గురుకుల విద్యార్థి

మెట్‌పల్లి రూరల్, జూలై, 30 : మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురై హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న గురుకుల విద్యార్థి కోలుకుని ఆస్పత్రి నుంచి మంగళవారం డిశ్చార్జి అయ్యాడు. విద్యార్థులు రాపర్తి హర్షవర్ధన్, అడెపు గణేష్‌లను మెరుగైన వైద్యం కోసం ఆర్డీవో శ్రీనివాస్, డీఎంహెచ్‌వో శ్రీనివాస్, సమీయొద్దీన్, మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. ఐదు రోజుల నుంచి చికిత్స పొందుత్ను వారిలో హర్షవర్ధన్‌ను ఆరోగ్యం కుదటపడడంతో డిశార్జి చేశారు. అడెపు గణేష్ ఆరోగ్యం నిలకడగా ఉందని, ఎప్పటికప్పుడు పరిశీలస్తున్నామని, రెండ్రోజులో డిశార్జి చేస్తారని, భయపడాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపారు.

పౌష్టికాహారం, వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రముఖ స్త్రీ వైద్యనిపుణురాలు డాక్టర్ బాస రత్నశ్రీ

జగిత్యాల అర్బన్, జూలై 30: మానవుని దైనందిక జీవితంలో పౌష్టికాహారం, వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రముఖ స్త్రీ వైద్యనిపుణురాలు డాక్టర్ బాస రత్నశ్రీ అన్నారు. పట్టణంలోని స్థానిక బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు పీసీఓఎస్ కార్యక్రమంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెలసరి కాకపోవడానికి కారణాలను వివరించారు. జంక్ ఫుడ్ మానేసి ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. పీసీఓఎస్ సమస్య యువతులు, టీనేజ్ బాలికల్లో అధికంగా ఉంటుందన్నారు. హార్మోన్స్ అసమతుల్యత నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను స్లైడ్‌షో ద్వారా రత్నశ్రీ వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆలియామకృూద్, అధ్యాపకులు సమీనా, రుమాన, శ్రీలత, శిల్ప, గంగాభవాని తదితరులున్నారు.

'ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలి'

మెట్‌పల్లి, జూలై, 30 : మానవ తప్పిదాలతోనే అధికంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, వాటిని నివారించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరుట్ల వెహికిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. మంగలవారం మెట్‌పల్లి ఆర్టీసీ డిపోలో మేనేజర్ దేవరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రమాద రహిత వారోత్సవాల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రమాదాల నివారణలో డ్రై వర్ల అనుభవం చాలా కీలకం, విధి నిర్వహణలో డ్రైవర్లు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మానవ తప్పిదాలతోనే అధికంగా ప్రమాదాలు చోటీ చేసుకుంటున్నాయని, ఫోన్లు మాట్లాడుతూ వాహనం నడపడం ప్రమాదమని పేర్కొన్నారు. డిపో మేనేజర్ దేవరాజ్ మాట్లాడుతూ ఆర్టీసీలో నిపుణులైన డ్రైవర్లు ఉండడంతో ప్రమాదాల రేటు తక్కువగా ఉందన్నారు. అనంతరం 19 సంవత్సరాలపై విధులో ఉండి ప్రమాద రహిత ఉత్తమ డ్రైవర్లు ఎంఎరెడ్డి, ఎల్‌బి రావు, రవీందర్‌తో పాటు ఉత్తమ సిబ్బందిలను శాలువలతో ఘనంగా సన్మానించారు. ట్రాఫిక్, మెకానికల్ సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు సన్మానం

భీమారం, జూలై 30: భీమారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆరు సంవత్సరాలుగా పని చేస్తున్న ఉపాధ్యాయులు మహేష్, రామ్, నరేష్, శ్వేత, వాస్తవిక, శ్రీధర్, రహీం, జ్యోతి, కిషోర్‌లను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జవ్వాజి అశోక్, స్కూల్ చైర్మన్ లావణ్య, గ్రామ తాజా మాజీ సర్పంచ్ చెక్కపెల్లి అరుణరఘు, మాజీ ఉప సర్పంచ్ బస్వరాజుల రాజు, పాల్గొన్నారు.

●బదిలీపై వెళ్తున్న మండలంలోని గోవిందారం అటవీ శాఖ బీట్ అధికారి గాండ్ల మధుసూదన్‌ను మంగళవారం రాజలింగంపేట గ్రామంలో ఘనంగా సన్మానించారు. ఆయన చేసిన కృషిని పలువురు కొనియాడారు. ఈ కార్య క్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, పార్టీ మండల అధ్యక్షుడు సత్తిరెడ్డి, మాజీ ఎంపీటీసీలు పులిసె శ్రీనివాస్, బాలుసాని రవి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సురేందర్ రావు, మాజీ సర్పంచ్ చారి, పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మసిస్టుగా పని చేస్తున్న ఉదయ్ కుమార్ బదిలీపై వెళ్తుండగా మంగళవారం లయన్స్ క్లబ్ అధ్యక్షులు సన్మానించారు. పూలమాలలు, శాలువతో ఘనంగా సత్కారించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నేమూరి సత్యనారయణ, ఎలేటి చిన్నారెడ్డి, రమేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రజలు ఆలోచనలకు పదును పెట్టాలి

ఇన్నోవేషన్ జిల్లా కోఆర్డినేటర్ జలెందర్

మెట్‌పల్లి రూరల్, జూలై, 30 : ప్రజల్లో దాగి ఉన్న తమ ఆలోచనలకు పదును పెట్టి గ్రామలాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఇన్నోవేషన్ జిల్లా కోఆర్డినేటర్ జలెందర్, ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. మంగళవారం మెట్‌పల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇన్నోవేషన్ కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన నిర్వహించినంతరం పోస్టర్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో సభలు నిర్వహించి ఇన్నోవేషన్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆసక్తి గల వారు తమ ఆవిష్కరణ పేరు, ఫోన్ నంబర్, ఆవిష్కరణ వివరాలు 100పదాలతో రాసి, వాటి ఫొటోలు నాలుగు, వీడియో రెండు నిమిషాలు ఉండాలి, వ్యక్తి పేరు, వయస్సు, ప్రస్తుతం చేస్తున్న వృత్తి వివరాలను వాట్సాప్ నంబర్ 9100678543కు పంపాలన్నారు. కార్యక్రమంలో పాల్గొనే వారి వయస్సుతో సంబంధం లేకుండా ఆవిష్కరణ వివరాలను ఆగస్టు 3లోపు పంపాలి, వీరికి ఆగస్టు 15న జరిగే స్వాతంత్ర దినోత్స కార్యక్రమంలో ప్రదర్శిస్తామన్నారు. అందులో ఉత్తమ ఆవిష్కరణను ఎంపిక చేసి ప్రశంసాపత్రం అందజేసి సత్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, ఏపీవో తిరుపతిరావు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్ : నూతన ఆలోచన విధానాలను అలవర్చుకోవాలని ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ కిషన్, ఎంఈవో నరేశం అన్నారు. మంగళవారం పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులకు ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన ఇనోవేటర్ విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడారు. అన్ని గ్రామాలలో గ్రామ సభలను నిర్వహించి నూతన అలోచన విధానాలపై అవగాహన కల్పించాలని అన్నారు. కొత్తగా రూపొందిన యంత్రాలు తయారు చేసి వాటి ఆవిష్కచించి వాటిపై పేరు ఫోన్ నంబర్ వివరాలను 100 పదాలతో రాసి ఆవిష్కచించిన ఫోటోలను, వీడియోలను వాట్సప్ నండర్ 9100678543కు పోస్టు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మమత, తిరుపతి రావు, ఎంపీవో మహేశ్వర్ రెడ్డిలతో పాటు పలు గ్రామాలకు చెందిన కార్యదర్శులు పాల్గొన్నారు.



మెట్‌పల్లి ఎంపీడీవో కార్యాలయం ముందు పోస్టర్లతో అధికారులు, కార్యదర్శులు

సంక్షిప్తం సమాచారం

జగిత్యాల : సీఎం రేవంత్‌రెడ్డిని మంగళవారం మాజీ మంత్రి రాజేశం గౌడ్ కలిశారు. హైద్రాబాద్‌లోని సచివాలయంలో మాజీ ఎమ్మెల్యేల అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఎంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో పలువురు మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

జగిత్యాల టౌన్: రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిలను ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌తో కలిసి జగిత్యాల మున్సిపల్ కౌన్సిలర్లు మర్యాద పూర్వకంగా కలిసారు. జగిత్యాల పట్టణ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు.

రాయికల్: రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదానం చేశారు. లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ ఘట్టమనేని బాబురావు జన్మదినం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో 60 మంది నిరుపేదలకు అన్నదానం చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మచ్చ శేఖర్, మాజీ జడ్‌సీ రమేష్ పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణానికి చెందిన నాయీబ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు మున్సిపల్ సిబ్బందిపై కమిషనర్ చిరంజీవికి మంగళవారం ఫిర్యాదు చేశారు. నాయీబ్రాహ్మణ కులస్థుడైన రాచకొండ బ్రహ్మయ్య సోమవారం మరణించగా అంత్యక్రియల నిమిత్తం రాయికల్ శ్మశాన వాటికలో నీటి వసతి కల్పించాలని సిబ్బందిని కోరారు. అయినా సిబ్బంది ఎటువంటి నీటి వసతి కల్పించక పోవడంతో పాటు సమాచారం కూడా ఇవ్వలేదన్నారు. కావున బాధ్యతారాహిత్య సిబ్బంది పై తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

●మండలంలోని కొత్తపేట గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఐదుగురు ఉపాధ్యాయులకు మంగళవారం ఘనంగా సన్మానం చేశారు. బదిలీపై వెళ్తున్న రత్నాకర్, వెంకట్ రెడ్డి, సైఫుద్దీన్, జమున, రామ్మోహన్‌లను సన్మానించారు.

●రాయికల్ పట్టణంలోని భవాని కిట్టీ పార్టీ సభ్యులు మంగళవారం గోరింటాకు ఉత్సవం నిర్వహించారు. మహిళలు గోరింటాకును తయారు చేసి సంబరాలు చేసుకున్నారు. కిట్టీ పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

●తమ డిమాండ్ల పరిష్కారం కోసం హైదరాబాద్‌కు తరలివెళ్తున్న ఆశ కార్యకర్తలను మంగళవారం రాయికల్ పోలీసులు అడ్డుకున్నారు. ఆశ కార్యకర్తలు తమ న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. అనంతరం వారిని ఇంటికి పంపించారు.

పెగడపల్లి: అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని పెగడపల్లి ఎంపీ డీవో ఎ.శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం, ఎస్సీ బాలుర హాస్టల్‌లను ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు.

గొల్లపల్లి : మండలంలోని తిర్మలాపూర్ (పీడీ) గ్రామంలో బుధవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పౌర హక్కుల వేడుకలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మహ్మద్ జమీర్ తెలిపారు. పౌర హక్కుల వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

కోరుట్ల రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం రెండవ విడుత రుణమాఫీ పథకంను ప్రారంభించడంపై వ్యవసాయ మండల అధికారిణి నాగమణి ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని అయిలాపూర్ క్లస్టర్ పరిధిలోని రైతులను అవగాహన కల్పించారు. కోరుట్ల మండలంలోని రెండవ విడుత రుణ మాఫీలో 968 మంది రైతులు లబ్ధి పొందనున్నట్లు వ్యవసాయ అధికారిని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు రైతులతో కలిసి సంబరాలు నిర్వహించారు. రైతులు, వ్యవసాయి అధికారులు పాల్గొన్నారు.

జగిత్యాల: జిల్లా కేంద్రంలో గల ఎస్‌సీ స్టడీ సర్కిల్ కేంద్రానికి శాశ్వత భవనం నిర్మించాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంగళవారం ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి లేఖ రాశారు.

మెట్‌పల్లి : పట్టణంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడుగా ఇటీవల ఎన్నికైనా ఖైలారపు లింబాద్రి దంపతులను స్నేహాలయ కిట్టి పార్టీ సభ్యులు శాలువతో సన్మానించారు. మంగళవారం పట్టణంలోని ఆయన నివాసంలో దంపతులకు మహిళలు శాలువ కప్పి సన్మా నించారు. స్నేహాలయ కిట్టి పార్టీ అధ్య క్షురాలు మధుమిత, సభ్యులు కోట ధనలక్ష్మి, దేవరశెట్టి మంజుల, బండారి హరీష, పావని, రేవతి, ఎలగందుల సంధ్య, అనంతుల స్మిత, చిలమంతుల రాధ పాల్గొన్నారు.

కథలాపూర్: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతనంగా ప్రవేశ పెట్టిన ప్రీ స్కూల్ విధానం దాని వల్ల కలిగే ప్రయోజనాల గురించి మండలంలోని సిరికొండలో చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

ధర్మపురి: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ ఘట్టమనేని బాపురావు జన్మదినం సందర్భంగా ధర్మపురి పట్టణంలోని గోదావరి నది వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నిరుపేదలకు అన్నదానం నిర్వహించారు.

మల్యాల: మెట్‌పల్లికి చెందిన రమేష్ అనే వ్యక్తి కోరుట్లలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్ మండలంలోని గొర్రెగుండంకు చెందిన అడ్వకేట్ తొగిటి తిరుమలేష్‌కు దొరకగా రమేష్‌కు సెల్‌ఫోన్ అప్పగించాడు.